# ప్రపంచ వేద వ్యాపక దినము - 2025

## పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి సందేశం

## 19 అక్టోబరు, 2025

### *ప్రజలందరి మధ్య నమ్మిక (ఆశ) కు ప్రేషితులు*

*ప్రియ సహోదరీ సహోదరులారా!*

ఈ జూబిలీ సంవత్సరములో ప్రపంచ వేద వ్యాపక దినోత్సవం కోసం, దాని ప్రధాన అంశమైన నమ్మిక (ఆశ) **(Cf. Bull Spes Non Confundily)** నుండి "ప్రజలందరి మధ్య నమ్మిక (ఆశ)కు ప్రేషితులు" అను నినాదాన్ని ఎన్నుకున్నాను. ఇది జ్ఞాన స్నానం పొందిన సంఘమైన యావత్ శ్రీసభకు, క్రైస్తవులందరకూ వ్యక్తిగతంగానూ, మన ప్రాథమిక పిలుపుయగు క్రీస్తు అడుగుజాడలలో నమ్మిక (ఆశ) నిర్మాతలుగా, దూతలుగా ఉండడము అని జ్ఞాపకం చేస్తుంది. సజీవ నిరీక్షణకై ఉత్థాన క్రీస్తునందు నూతన జన్మనొందిన దైవప్రజలందరికి ఇది ఒక అనుగ్రహకాలమని నేను నమ్ముతున్నాను. (చూ.1 పేతురు 1:3-4) మన క్రైస్తవ ప్రేషితుల గుర్తింపుకు సంబంధించిన కొన్ని అంశాలను నేనిక్కడ ప్రస్తావించదలచుకున్నాను. తద్వారా మనము దేవుని ఆత్మచేత నడిపింపబడి, చీకటి నీడలు అలుముకున్న ఈ ప్రపంచములో నూతన నమ్మిక (ఆశ)ను పునరుద్ధరించడానికి పంపబడిన శ్రీసభలో సరిక్రొత్త సువార్తా వ్యాప్తికై పవిత్ర ఉత్సాహముతో ప్రజ్వలింపబడగలము. **(Cf. Fratelli Tutti, 9-55).**

### 1. మన నమ్మిక (ఆశ)యైన క్రీస్తు అడుగుజాడలలో ...

పవిత్ర సంవత్సరమైన 2000 తరువాత మూడవ సహస్రాబ్దిలోని సాధారణ జూబిలీ (2025)ను జరుపుకుంటున్న మనము చరిత్ర కేంద్ర బిందువైన "నిన్న, నేడు, రేపు మరియు ఎన్నడును ఒకే రీతిగనుండు" హెబ్రీ 13:8) క్రీస్తుపైన మన దృష్టి నిలుపుదాము. నజరేతు నందలి ప్రార్థనా మందిరమున యేసు తన ఉనికి చరిత్రలో "నేడు" (నాడు) నెరవేరినదని ప్రకటించారు. ఈ విధముగా ఆయన పవిత్రాత్మచే అభిషేకింపబడి, మానవులందరకూ దైవ రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుటకు, ప్రభుహితమైన సంవత్సరమును ప్రారంభించుటకును తండ్రిచేత పంపబడినట్లు బహిర్గతపరచారు. (చూ. లూకా 4:16-21)

ఆధ్యాత్మిక మర్మపూరితమైన ఈ "నేడు"లో అందరకూ ప్రత్యేకంగా దేవునియందు మాత్రమే నమ్మకముంచిన వారందరకూ క్రీస్తే రక్షణ పరిపూర్ణత. తన ఇహలోక జీవితములో ప్రజలందరకూ, అవసర బాధితులకు దేవునియందు నమ్మకమును పునరుద్ధరించుటకు అంతటను పర్యటించుచు, మేలు చేయుచు, పిశాచ శక్తి లోబడిన వారందరనూ బాగుచేసెను. (అ.కా. 10-38) పాపములనుండి రక్షించుటకు, నిరాశ నిస్పృహలకు దారి తీసే పరిస్థితులయిన గెత్సమని తోటలో రక్తచెమటతో కూడిన ఆవేదన, సిలువలోనూ ఆయన మానవ బలహీనతలన్నిటిని అనుభవించారు. నమ్మకముతో నిండిన భవిష్యత్ కొరకైన శాంతి ప్రణాళికయైన మానవ రక్షణ ప్రణాళికలో విధేయతతో కూడిన నమ్మకముంచి యేసు సమస్తమును తండ్రి దేవునికి అప్పగించాడు. (చూ. యిర్మీయ 29-11) ఈ విధముగా ఆయన నమ్మికకు దైవ ప్రేషితుడుగా మారి, శతాబ్దాలుగా తీవ్రమైన కఠిన పరీక్షల మధ్య, దేవుడు తమకిచ్చిన ప్రేషిత కార్యాన్ని కొనసాగించే వారందరకు అత్యున్నత నమూనా లేక మాదిరి అయ్యాడు.

ప్రజలందరి వద్దకు పంపబడిన తన శిష్యులకు ఆధ్యాత్మికముగా తోడుగా వెళ్ళుతూ ప్రభువైన యేసు మానవాళికై నమ్మిక పరిచర్యను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆయన పేదలు, వివిధ బాధితులు, నిరాశ నిస్పృహలకు గురయినవారు మరియు అణచివేయబడిన వారియెడల మ్రొగ్గుచూపుతూ, వారి గాయాలకు ఓదార్పు అనే ఔషధ తైలాన్ని, నమ్మకమను ద్రాక్షాసవమును (స్తుతిగీతము : మంచి సమరీయుడైన యేసు) క్రుమ్మరిస్తున్నారు.

క్రీస్తు ప్రేషిత శిష్యుల సంఘమయిన శ్రీసభ తన ప్రభువు. యజమానియైన క్రీస్తుకు విధేయులై, అదే సేవాభావముతో ఆ ప్రేషిత కార్యాన్ని కొనసాగిస్తూ అన్ని జాతుల మధ్య మానవులందరి కొరకై తన జీవితాన్ని అంకితమిస్తుంది. వేద హింసలు, కష్టాలు, వివిధ రకాలైన ఇబ్బందులతోపాటు తన స్వీయ సభ్యుల బలహీనతల కారణంగా ఉత్పన్నమయ్యే లోపాలు, వైఫల్యాలను ఎదుర్కొంటున్నప్పటికీ శ్రీసభ నిరంతరము క్రీస్తుతో ఏకమై, ఆయన ప్రేమచే ప్రేరేపింపబడి తన ప్రేషిత (**Missionary**) ప్రయాణములో, క్రీస్తుతో, క్రీస్తు మాదిరిగా బాధాతప్త మానవాళి మొరను, వాస్తవానికి నిశ్చయమగు రక్షణ కొరకు ఎదురు చూస్తున్న ప్రతి జీవియొక్క మూలుగును వినడానికి పట్టుదల కలిగి వుంటుంది. ఇలాంటి శ్రీసభ అనగా "చలనం లేని శ్రీసభ కాదుగాని, తన ప్రభువుతో కలసి ప్రపంచ వీధులలో నడిచే ప్రేషిత శ్రీసభ (**Missionary Church**)ను (పీఠాధిపతుల సాధారణ జనరల్ సమావేశ ముగింపు దివ్యబలి పూజలోని సందేశము అక్టోబరు 27, 2024) ప్రభువు ఎల్లప్పుడూ నిరంతరము తన అడుగుజాడలలో నడుచుటకు పిలుస్తున్నారు.

మనం కూడా అందరకూ నమ్మిక (ఆశ) యొక్క దూతలుగా, సంకేతాలుగా అన్ని పరిస్థితులలోనూ దేవుడు మనము జీవించుటకు ఒసగిన ప్రతి స్థలములోనూ, అన్ని పరిస్థితులలోనూ అందరకూ "నమ్మిక" (ఆశ) యొక్క దూతలుగా సంకేతాలుగా ఉండడానికి ప్రేరేపింపబడినవారమై, ప్రభు యేసుని అడుగుజాడలలో నడచుటకు ఉద్యుక్తులమవుదాం. జ్ఞానస్నానము పొందిన వారందరూ, క్రీస్తుని ప్రేషిత శిష్యులుగా, తమ నమ్మకమును పుడమిపై అన్ని దిక్కులలో ప్రకాశింపచేయుదురు గాక!

## 2. క్రైస్తవులు, ప్రజలందరి మధ్య నమ్మిక (Hope) వాహకులు మరియు నిర్మాతలు

క్రీస్తు ప్రభువును అనుసరించడంలో, క్రైస్తవులు తాము ఎవరెవరినైతే కలుసుకుంటారో వారియొక్క నిర్దిష్ట జీవిత స్థితిగతులను పంచుకోవడం ద్వారా సువార్తను అందించడానికి పిలువబడుతున్నారు. తద్వారా వారు నమ్మిక వాహకులుగా, నిర్మాతలుగా అవుతున్నారు. వాస్తవానికి ఈనాటి ప్రజల యొక్క ప్రత్యేకంగా పేదలు, బాధితుల ఆనందాలు, ఆశలు, దుఃఖములు, వేదనలు క్రీస్తు అనుచరుల యొక్క ఆనందాలు, ఆశలు, దుఃఖములు, వేదనలు అవుతాయి. తమ హృదయాలలో ప్రతిధ్వనిస్తున్న ఈ భావాలను గుర్తించడంలో యదార్ధవంతుడైన ఏ మానవుడూ విఫలము కాడు. ( **Gaudium et Spes 1**).

ప్రతి యుగంలోనూ క్రైస్తవ సమాజాల భావాలను మరియు శైలిని వ్యక్తపరచే రెండవ వాటికన్ సభ యొక్క ఈ ప్రసిద్ధ ప్రకటన తమ సభ్యులను ప్రపంచములోని సహోదరీ సహోదరులతో కలసి నడవడానికి ప్రేరేపిస్తూ, సహాయపడుతుంది. ఇక్కడ నేను మిషనరీలుగా ఇతర దేశాలకు వెళ్ళినవారి గురించి ఆలోచిస్తున్నాను. ప్రభువు పిలుపును అనుసరించి మీరు క్రీస్తులో దేవుని ప్రేమను గురించి తెలియజేయడానికి ఇతర దేశాలకు వెళ్ళారు. అందుకు నేను మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను. తన శిష్యులను సకల ప్రజలకు సువార్తను బోధించుటకై పంపిన ఉత్థాన క్రీస్తు ఆజ్ఞకు స్పష్టమైన స్పందనగా మీ జీవితాలు నిలుస్తున్నాయి. (**Cf.** మత్త 18:18-20).

ఈ విధముగా మీరు ఆత్మశక్తి ద్వారాను, అనుదిన ప్రయత్నాల ద్వారాను ప్రభువైన యేసుక్రీస్తు మనకిచ్చిన గొప్ప నమ్మిక (Hope) కు ప్రజలందరి మధ్యన వేదవ్యాపకులుగా (Missionaries) మరియు సాక్షులుగా ఉండుటకు జ్ఞానస్నానము పొందినవారి సార్వత్రిక దైవ పిలుపుకు మీరు సంకేతాలు అవుతున్నారు.

ఈ నమ్మిక (ఆశ) యొక్క పరిధి (క్షితిజం) ఈ ప్రపంచంలోని గతించిపోయే అంశాలను అధిగమించి, మనమిప్పుడు పంచుకునే దైవిక (ఆధ్యాత్మిక) వాస్తవాలకు తెర తీస్తుంది. పు.6వ పౌలుగారు గమనించినట్లు : శ్రీసభ ప్రజలందరకూ దేవుని దయా బహుమతిగా అందిస్తున్న "క్రీస్తునందు రక్షణ, కేవలము అంతర్గతమైనది, ఆధ్యాత్మిక, భౌతిక అవసరాలను తీర్చడము మాత్రమే కాదు గాని... పూర్తిగా తాత్కాలిక కోరికలు ఆశలు, సంఘర్షణలలో ఇరుక్కుపోయింది. ఏకైక సంపూర్ణ వ్యక్తియగు దేవునితో సహవాసాన్ని నెరవేర్చుకోవడానికి ఇది అన్ని పరిమితులను అధిగమించింది. నిజానికి ఈ జీవితంలోనే ప్రారంభమై శాశ్వతం (eternity) లో నెరవేర్చబడె ఈ రక్షణ అతీతము, పరలోక సంబంధితమునైయున్నది. (Evangali Nunwandi 27)

బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో, తీవ్రమైన మానవ సంక్షోభాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో: విస్తృతంగా పాకిన ఒక దిగ్భ్రాంతి భావన, వృద్ధుల అవసరాలపట్ల ఉదాసీనత, అవసరములలో ఉన్న పొరుగు వారికి సహాయమందించే ప్రయత్నం చేయడానికి కూడా ఇష్టపడకపోవడంలాంటి పరిస్థితులు నెలకొన్న నేటి ప్రపంచానికి, నమ్మిక ( **Hope**) తో ప్రేరేపించబడిన క్రైస్తవ సమాజాలు విభిన్నమైన నూతన మానవాళికి నాంది పలికేవిగా ఉంటాయి. సాంకేతికంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలలో వ్యక్తుల "సామీప్యత" రోజురోజుకూ కనుమరుగవుతోంది. అందరము పరస్పరం కలిసే ఉంటాము. కాని ఒకరికొకరము ఏమీ సంబంధం లేనట్లుగా

ఉంటాము. సామర్థ్యము పట్ల వ్యామోహము, భౌతిక వస్తువులు, ఆశయాల పట్ల అనుబంధము మనలను స్వార్థపరులనుగాను పరోపకారానికి అసమర్థులుగాను చేస్తుంది. సామాజిక జీవితములో అనుభవానికి తెచ్చుకున్న సువార్త, మనలను సంపూర్ణ, ఆరోగ్యకర, విమోచింపబడిన మానవజాతిగా పునరుద్ధరించగలదు.

ఈ కారణంచేతనే, బుల్ ఆఫ్ ఇండిక్షన్ ఆఫ్ ద జూబిలీ (**Bull of Indiction of the Jubilee Nos. 7-15**) లో ప్రస్తావించిన కార్యములను, ప్రత్యేకముగా అట్టడుగున ఉన్న పేదలు, బలహీనులు, రోగులు, వృద్ధులు మరియు భౌతిక వాద, వినియోగదారుల సమాజము నుండి మినహాయించబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధను చూపు పనులు చేయుటకు మరోసారి మిమ్మందరనూ ఆహ్వానిస్తున్నాను. అది కూడా దేవుని శైలిలోనే మన సహోదరీ సహోదరులతో సున్నితంగా కరుణతో సన్నిహితంగా వారి వారి నిర్దుష్ట పరిస్థితులలో వ్యక్తిగత అనుబంధాన్ని పెంపొందించుకుంటూ చేయాలి. **(Cf. Evangelis Gaudium 127-128).** సాధారణంగా వారే మనకు నమ్మిక (ఆశ)తో ఎలా జీవించాలో నేర్పుతారు. వ్యక్తిగత పరిచయాల ద్వారానే ప్రభుని కరుణారస ప్రేమను గూడా తెలియజేయగలము. మనం కూడా "సువార్తా ప్రాథమిక ప్రకటనకు మూలాధారం క్రీస్తు హృదయమే" **(Dilexit Nos.32)** అని గ్రహిస్తాము. అప్పుడు దీన్ని మూలముగా చేకొని దేవుని నుండి పొందిన నమ్మిక (**Hope**) ను నిరాడంబరముగా అందించవచ్చు. (1 పేతు 1:21), అంతేగాక దేవుని నుండి మనము పొందిన ఆదరణతో మనము ఇతరులనూ ఆదుకొనవచ్చు. దైవ మానవ స్వభావాలతో మిళితమైన యేసు హృదయము నుండి దేవుడు మనలనందరనూ తన ప్రేమవైపుకు ఆకర్షిస్తూ, ప్రతి స్త్రీ, పురుషుని హృదయాలతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. "ఆ పరిచర్యను కొనసాగించుటకు, యావత్ప్రపంచాన్ని ఆవరించిన క్రీస్తు హృదయానికి, తండ్రి ప్రేమకు చిహ్నములుగా యుండుటకు మనము పంపబడ్డాము" (పాపుగారి సభల జనరల్ అసెంబ్లీలో సందేశము జూన్ 3, 2023).

### 3. నమ్మిక (Hope) పునరుద్ధరణ

నేటి సమాజంలో నమ్మిక (**Hope**) యొక్క అత్యవసరతను గుర్తించిన క్రీస్తు శిష్యులు ప్రథమంగా తరచూ చీకాకులతో సంతోషము లేని మానవాళిలో నమ్మికను పునరుద్ధరించే నైపుణ్యము కలిగిన వారిగా ఎలా తయారుకాగలరో కనుగొనడానికి పిలువబడుతున్నారు.

ఈ లక్ష్యం కోసమే మనము పాల్గొను ప్రతి దివ్యబలి పూజలో మన అనుభవానికొచ్చే పాస్క పరమ రహస్య ఆధ్యాత్మికతలో మరీ ముఖ్యంగా దైవార్చనా సంవత్సరపు కేంద్ర బిందువు, శిఖరాగ్రమయిన పాస్కత్రయాహములో మనము నూత్నీకరింపబడవలసి యుంది. విముక్తి కారకమైన క్రీస్తు మరణము ఉత్థానములోను, చరిత్ర యొక్క శాశ్వత వసంతకాలానికి గురుతుగా యున్న ప్రభుని కడరా విందులోను మనము బాప్తిస్మమును పొందియున్నాము. తత్ఫలితముగా, మానవ ఉనికిపై ప్రకటించబడే "మరణము, ద్వేషము" అనునవి కడపటి లేక అంతిమ మాటలు కావని, క్రీస్తునందు తెలుసుకొని విశ్వశించిన మనము అందరితో పంచుకొనుటకు వసంతకాల ప్రజలముగా నమ్మిక (**Hope**)తో నిండియున్నాము. (చూ. సత్యోపదేశము 23 ఆగస్టు 2017). విశ్వ సువార్తీకరణ రంగంలో ఉత్సాహంతోనూ, సంకల్పముతోనూ మరియు సహనముతోనూ పనిచేయుటకు మనము దైవార్చనా వేడుకలలోనూ, దివ్య సంస్కారములలోనూ బయల్పడు పాస్కా పరమ రహస్యముల నుండి నిరంతరము పవిత్రాత్మ శక్తిని పొందుతున్నాము. ఉత్థానుడై మహిమపరుపబడిన క్రీస్తు మన నమ్మిక (**Hope**) కు సజీవ ఊట. కనుక మనము మనకు అప్పగింపబడిన ఈ పరిచర్యను కొనసాగించుటకు అవసరమయిన ఏ సహాయాన్ని ఆయన నిరాకరించడు. (**Evangeli Gaudium**) "దేవుని బహుమతి మరియు క్రైస్తవుల లక్ష్యము" అయిన ఆ పవిత్ర నమ్మిక (**Hope**) కు మనము క్రీస్తు నందు నివశిస్తూ, సాక్ష్యమిస్తున్నాము. (రాత్రి యందు నమ్మికయే వెలుగు, వాటికను, 2024, 7).

నమ్మిక (**Hope**) యొక్క ప్రేషితులు ప్రార్థనాపరులైన స్త్రీ, పురుషులు. ఎందుకంటే "నమ్మిక కల్గిన వ్యక్తే ప్రార్థించే వ్యక్తి" అని గౌరవనీయ ఫ్రాంకోయిస్ గ్జేవియర్ వాన్ తువాన్ కార్డినల్‌గారు చెప్పారు. ఎందుకంటే ఆయనే స్వయముగా తన సుదీర్ఘ జైలు జీవితములో నమ్మిక (**Hope**) తో నిలకడగా ఉండుటకు, తాను దివ్య సత్ప్రసాదము, విశ్వాసపాత్రమైన ప్రార్థన ద్వారానే పొందిన బలానికి ధన్యవాదాలు చెబుతున్నారు. (**Cf.** నమ్మిక బాట, **Boston, 2001, 963**) కావున ప్రార్థన మన వేదవ్యాపక ప్రధాన పరిచర్య అని ఎప్పుడూ మరువరాదు. అదే సమయంలో అది నమ్మిక (**Hope**)కు ప్రథమ బలమని గుర్తించాలి. (సత్యోపదేశం – 20, మే, 2020).

కాబట్టి మనము ప్రార్థన, ప్రత్యేకముగా దైవవాక్కు, పవిత్రాత్మచే కూర్చబడిన కీర్తనల ఆధారంగా మన నమ్మిక (**Hope**)లక్ష్యాన్ని నూత్నీకరించుకుందాం. (చూ. సత్యోపదేశం జూన్ 19, 2024) ఎందుకంటే ఈ కీర్తనలు మనకు కష్టనష్టాల మధ్య ఆశను పెంపొందించుకోవడానికి, మనచుట్టూ వున్న నమ్మిక (ఆశ) యొక్క సంకేతాలను గ్రహించడానికి, ప్రజలందరిచేత దేవుడు స్తుతించబడాలన్న ప్రేషిత కోరిక నిత్యమూ కలిగి ఉండడానికి మంచి శిక్షణ ఇస్తాయి. (చూ. కీర్త 41:12; 67:4). ప్రార్థించుట ద్వారానే దేవుడు మనలో వెలిగించిన నమ్మిక యొక్క నిప్పురవ్వను సజీవముగా ఉంచగలము. తద్వారా ఆ నిప్పురవ్వే గొప్ప వెలుతురు (మంట)గా మారి ప్రార్థన ద్వారా ప్రేరేపించబడు మాటలు, చేతల ద్వారా మన చుట్టూ వున్న వారందరనూ, ఉత్సాహభరితులను, చైతన్యవంతులను చేస్తుంది.

చివరిగా, అన్నివేళలా వేదవ్యాపకము క్రైస్తవ నమ్మిక (**Hope**) మాదిరిగానే ఒక సాంఘిక (సామూహిక) ప్రక్రియ. (**Cf. Benedict XVI Spe Salvi, 14**) ఈ ప్రక్రియ జ్ఞాన స్నానముతోను, సువార్త ప్రారంభ బోధనతోటే ముగిసిపోదు. కాని, సువార్తా మార్గములో జ్ఞానస్నానం పొందిన ప్రతివ్యక్తి తోడుగా ఉండడముద్వారా క్రైస్తవ సంఘాలను నిర్మించుటలో ఈ ప్రక్రియ కొనసాగుతూ వుంటుంది. నేటి ఆధునిక సమాజంలో శ్రీసభలో సభ్యత్వము అనేది ఒకేసారి సాధించుకున్నది ఎప్పటికీ కాదు. అందువల్ల క్రీస్తునందు పరిణితి చెందిన విశ్వాసాన్ని రూపొందించడము, వేదవ్యాపక కార్యకలాపాలను తర్వాత తరాలకు అందించడము అనేవి శ్రీ సభా కార్యకలాపాలకు నమూనాలు. (**Evangeli Gaudium, 15**) ఈ పనికి సాంఘిక ప్రార్థన మరియు క్రియల సహకారము ఎంతో అవసరము. ఈ సందర్భంలో శ్రీసభ యొక్క ప్రేషిత భాగస్వామ్యము యొక్క ప్రాముఖ్యతను మరియు పాపుగారి వేదవ్యాపక సభలు (**Pontifical Mission Societies**) జ్ఞానస్నానం పొందిన వారి వేదవ్యాపక బాధ్యతను ప్రచారం చేయడములోనూ, నూతన ప్రత్యేక శ్రీసభలకు ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా మద్దతునివ్వడంలోనూ అందిస్తున్న విస్తృత సేవలను నేను నొక్కి వక్కాణిస్తున్నాను. కాబట్టి పిల్లలు, పెద్దలు, యువత అందరు మీ జీవిత సాక్ష్యము, ప్రార్థన ద్వారాను, మీ త్యాగములు, మీ ఉదారత ద్వారాను శ్రీసభ సాధారణ వేదవ్యాపక పరిచర్యలో పాల్గొనాలని ప్రగాఢముగా కోరుతున్నాను. ఇందుకు మీకు నా ధన్యవాదములు.

ప్రియ సహోదరీ సహోదరులారా! మన నమ్మికయైన యేసుక్రీస్తు తల్లియగు మరియమాతను సమీపించుదాము. ఈ జూబిలీకి, రాబోయే సంవత్సరాలకూ మన ప్రార్థనను ఆ తల్లికి సమర్పించుదాము. క్రైస్తవ నమ్మిక (**Hope**) యొక్క వెలుగు అందరకూ అందించబడే దేవుని ప్రేమ సందేశముగా ప్రతివారిపై ప్రకాశించునుగాక!

శ్రీసభ యావత్ప్రపంచమందంతట, అన్ని ప్రాంతాలలో ఈ సందేశమునకు విశ్వసనీయ సాక్ష్యముగా నిలుచునుగాక! (**Bull Spes Non Confundit, 6**).

**† ఫ్రాన్సిస్ పాపుగారు**
పునీత పౌలు పరివర్తన పండుగ
జనవరి 25, 2025
పునీత యోహాను లాటెరాను దేవాలయము, రోము.

*అనువాదము :* **ఫా. జాన్‌రాజు,** P.M.O. Regional Director, విజయవాడ